# అడుగడుగునా అడ్డంకులే

- మినుముకు సాగునీరందేదెలా?
- పుల్లేటి కాల్వలో పేరుకుపోయిన వ్యర్థాలు

గుడ్లవల్లేరు: పుల్లేటి కాల్వ నుంచి చీలే క్యాంప్‌బెల్ కాల్వ లాకుల వద్ద గుర్రపుడెక్కతో సాగునీరు ముందుకు సాగటం లేదు. దీంతో మినుము సాగు తడుపులకు నీరందక రైతులు ఆయిల్ ఇంజిన్లను ఆశ్రయిస్తున్నారు. ఇంజిన్లతో పాటు ట్యూబులకు అద్దె తడిసి మోపెడు అవుతోంది. సవ్యంగా సాగునీరు అందిస్తే ఈ ఇబ్బందులు ఉండవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్యాంప్‌బెల్ కెనాల్ లాకుల వద్ద చిక్కుకుపోయిన వ్యర్థాల మూటలు స్థానికులు అందర్నీ ముక్కులు మూసుకునేలా చేస్తున్నాయి. అర కిలోమీటరు మేరకు చుట్టుపక్కల ఉన్న కుటుంబాల వారు నోట్లో ముద్ద పెట్టనీయకుండా ఈ వ్యర్థాల మూటల దుర్వాసన సంకటంగా మారింది.



లాకుల వద్ద చిక్కుకుపోయిన వ్యర్థాల మూటలు



పుల్లేటి కాల్వలో మేటేసుకుపోయిన గుర్రపు డెక్క

**మూటల్లో మాంసపు వ్యర్థాలు**

సాగునీటితో పాటు తాగునీరు దిగువ ప్రాంతాలకు ప్రవహించే ఈ కాల్వలో కుళ్లిపోయిన కోడి పేగులు, మాంసపు వ్యర్థాలను మూటలుగా కట్టి పారవేయటంతో లాకుల వద్ద చిక్కుకుపోతున్నాయి. అవి నీటితో పాటు ముందుకు కదలకుండా లాకులు పట్టేయటంతో ఈ ప్రాంతంలోని వాసులు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితులు దాపురించాయి. వైఎస్సార్ బ్రిడ్జిపై రాకపోకల్లో కూడా ఈ దుర్వాసనకు వాహన చోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నీటినే గ్రామ పంచాయతీ చెరువులకు మంచినీటిగా పెడుతున్న తరుణంలో ఈ వ్యర్థాలు వేయటంతో స్థానికులు విమర్శిస్తున్నారు. కనీసం చుట్టుపక్కలున్న వారు నోట్లో ముద్ద కూడా పెట్టలేకుండా దుర్వాసన వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఆయిల్ ఇంజిన్‌తో పొలానికి నీటిని పెట్టుకున్న రైతు

### దుర్వాసన భరించలేకున్నాం



పుల్లేటి కాల్వలో నిల్వ ఉన్న వ్యర్థాల కారణంగా చుట్టుపక్కల నివాసులు నోట్లో అన్నం పెట్టుకునే అవకాశం లేకుండా పోతుంది. ఈ ప్రాంతంలో వస్తున్న దుర్వాసన భరించలేకపోతున్నాం. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– నరేష్, మాజీ ఉప సర్పంచ్, కూరాడ, గుడ్లవల్లేరు మండలం

### సాగునీరు చేరేదెలా?

వ్యవసాయ సాగుకు దిగువ ప్రాంతాలకు సాగునీరు రాకుండా గుర్రపు డెక్క పుల్లేటి కాల్వలో అడ్డంగా మేటేసుకుపోయింది. ఆయిల్ ఇంజిన్లతో సాగునీటిని తోడుకుని మినుము పైరును తడుపుకునే ప్రతికూల పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలి.



– ముక్కు సోమేశ్వరరావు, శేరీ దగ్గుమిల్లి ఎంపీటీసీ, గుడ్లవల్లేరు మండలం

### గుర్రపు డెక్కను తొలగిస్తాం

గుర్రపు డెక్కను పుల్లేటి కాల్వ నుంచి తొలగిస్తాం. వ్యర్థాలను వేసే అనుమానితులకు పలుమార్లు హెచ్చరికలు ఇచ్చాం. ఇకపై వ్యర్థాలను వేయకుండా లస్కర్లను కాపలా ఉంచుతాం.

– దావీదు, లాకు సూపరింటెండెంట్

## ఘనంగా కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం



పామర్రులో ఎమ్మెల్యే కుమార్‌రాజా పూజలు



ముదినేపల్లిలో ఎమ్మెల్సీ జయమంగళ పూజలు

పామర్రు: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకులు ముత్తేవి మాధవ్‌కుమార్, ఆర్యవైశ్య సంఘ నాయకులు కలిసి పూర్ణకుంభంతో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజాను ఆలయంలోకి స్వాగతం పలికారు. అమ్మవారికి ఎమ్మెల్యే పట్టు వస్త్రాలను అందజేసి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీసభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఆర్యవైశ్య సంఘ నాయకులు జాలయ్య, సాయిబాబు, శ్రీనివాస్, తివిక్రమసాయిరాం పాల్గొన్నారు.

**మొవ్వలో..**

మొవ్వ: శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మర్పణ దినోత్సవాన్ని శుక్రవారం మొవ్వలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి చరిత్ర పై నిర్వహించిన క్విజ్ పోటీల్లో ప్రథమ బహుమతిని పల్లంపాటి రేవతి, ద్వితీయ బహుమతి నందిపాటి ఉషకు అందజేశారు. నందిపాటి వెంకట నాగ రమేష్, ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ ఎందురి జగన్మోహనరావు, వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ నంబూరి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

**ముదినేపల్లిలో..**

ముదినేపల్లి రూరల్: స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆత్మార్పణ దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. స్థానిక వాసవీ సేవాదళ్ ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం చేశారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అమ్మవారికి పూజలు చేశారు. వాసవీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు వొత్తిమిల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు స్వాగతం పలికి పూజలు చేయించారు.

**గుడివాడలో..**

గుడివాడ టౌన్: స్థానిక వాసవీచౌక్‌లోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో వాసవీమాత ఆత్మార్పణా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు టీఎస్‌వీ సాంబశివరావు దేవస్థానం వద్ద వాసవి మాత పతాకాన్ని ఎగురవేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఆర్యవైశ్య ప్రముఖులు పోకూరి మోహన్‌రావు, తిరివీధి శ్రీరాములు, బొగ్గారపు తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు. శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని ఎమ్మెల్యే రాము దర్శించుకున్నారు.

**గుడ్లవల్లేరులో..**

గుడ్లవల్లేరు: స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి పంచాయన క్షేత్రంలో అమ్మవారి ఆత్మార్పణా దినోత్సవ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. మహిళా భక్తులు అధికసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

**తోట్లవల్లూరులో..**

తోట్లవల్లూరు: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినం శుక్రవారం జరిగింది. అర్చకుడు అగ్నిహోత్రం విప్రనారాయణ ఆధ్వర్యంలో వాసవీ అమ్మవారికి పూజలు జరిగాయి. ఆలయ చైర్మన్ తాడికొండ ఉదయసూర్య సుధాకర్, సంఘం నాయకులు ఉమామహేశ్వరరావు, కృష్ణకుమార్ పాల్గొన్నారు.

## సమన్వయంతో పనిచేయాలి



పామర్రు: అధికారులు సమన్వయంతో ఉంటూ స్థానిక ప్రజా ప్రతినిధులను కలుకుంటూ అభివృద్ధి పనులు నిర్వహించాలని ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పరిషత్ సభ్యుల సమావేశం శుక్రవారం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ దోమల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. రానున్న వేసవి కాలంలో తాగునీటికి ఎక్కడ ఇబ్బందులు పడకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీడీఓ జ్యోతి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## పశువైద్య శిబిరాలు వినియోగించుకోండి

మండవల్లి: ఉచిత పశు వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని పశు సంవర్ధకశాఖ డాక్టర్ రామకృష్ణ అన్నారు. మండలంలోని చింతలపూడిలో శుక్రవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవాలకు బలానికి మినరల్ మిక్చర్ పంపిణీ చేశారు. చిన్న జీవాలకు నత్తల నివారణ మందు తాగించారు. డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ పశువులు ఎటువంటి వ్యాధుల బారిన పడకుండా పశుపోషకులు పశువులకు టీకాలు, మందులు వాడాలని సూచించారు.

## కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుంది

**మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్**

తోట్లవల్లూరు: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పామర్రు మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని భద్రిరాజుపాలెం, ఐలూరులో శుక్రవారం ఆయన పర్యటించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. కార్యకర్తలపై ఇటీవల జరిగిన దాడులను ఖండించటంతోపాటు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. నాయకులు, కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటానని భరోసానిచ్చారు.

**పిడుగు కుటుంబానికి పరామర్శ..**

ఐలూరులో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త పిడుగు నాగరాజు కుటుంబసభ్యులను మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పరామర్శించారు. జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు హేమలత, ఉదయభాస్కర్, వైస్ ఎంపీపీలు శివారెడ్డి, వెంకటేశ్వరరావు, నాయకులు గవాస్కర్‌రాజు, రూబెన్, లతీఫ్‌హుస్సేన్, శ్రీనివాసరెడ్డి, తిరుమలరెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



భద్రిరాజుపాలెంలో నాయకులతో మాట్లాడుతున్న కైలే అనిల్‌కుమార్

## ఏడు ఇళ్లు దగ్ధం

కోసూరు(మొవ్వ): మొవ్వ మండలం కోసూరులో మల్లంపల్లి రోడ్డు ఇందిరమ్మ కాలనీలోని శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో చెంచులకు చెందిన ఏడు తాటాకు ఇళ్లు దగ్ధమయ్యాయి. బోగెం ఏడు కొండలు, బోగెం చింతయ్య ఇంటిలోని గ్యాస్ సిలిండర్ లీకేజీ కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో మంటలు చెలరేగి నల్లపోతుల రాములమ్మ, బోగెం బాలకృష్ణ, ఆవుల పెద వెంకమ్మ, ఆవుల కోటేశ్వరరావు, ఆవుల వాసు ఇళ్లకు వ్యాపించటంతో ఏడు ఇళ్లు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న మొవ్వ అగ్రిమాపక కేంద్ర అధికారి కొణతం వెంకటేశ్వరరావు సిబ్బంది సహకారంతో మంటలను అదుపు చేశారు. వీఆర్వో మణ్రివాడ నవీన్‌రెడ్డి ప్రాథమిక సమాచారాన్ని తహసీల్దార్ కే మస్తాన్‌కు తెలిపారు. బాధితులకు నిత్యావసరాలు, రెండు గ్యాస్ సిలెండర్లను అందజేశారు. గ్రామ సర్పంచ్ పెనుమూడి రమేష్, కార్యదర్శి ఎంఎస్ఎస్ మూర్తి, నాయకుడు గోగినేని పెరుమాళ్లు పాల్గొన్నారు.



బాధితులకు నిత్యావసరాలను అందజేసిన తహసీల్దార్, నాయకులు

## అల్యూమినియం ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

గుడివాడ టౌన్: స్థానిక బంటుమిల్లి రోడ్‌లోని ముబారక్ సెంటర్ కుమ్మరి చెరువు గట్టుపై ఉన్న శ్రీ హరిహరనాథ మెటల్ ఇండస్ట్రీస్‌లో శుక్రవారం అగ్నిప్రమాదం సంభవించింది. స్థానికుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఇండస్ట్రీలో వాడే ఫర్నేస్ ఆయిల్ సాధారణ కొలిమిలో వాడటం ప్రమాదానికి కారణమని అగ్నిమాపక అధికారులు తెలిపారు. పక్కనే ఉన్న పుల్లలకు మంటలు అంటుకోవడంతో పొగతో పాటు పెద్ద మంటలు ఎగసిపడ్డాయి. అగ్నిమాపక సిబ్బంది చాకచక్యంతో వాటిని అదుపు చేసినట్లు అగ్నిమాపక శాఖాధికారి ఆంజనేయులు తెలిపారు.

## మౌనం వీడండి.. ధైర్యంగా మాట్లాడండి

**సీనియర్ సివిల్ జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి**

కైకలూరు: విద్యార్థి దశ నుంచి మౌనం వీడి, ప్రతి విషయాన్ని ధైర్యంగా వ్యక్తపరచాలని కైకలూరు సీనియర్ సివిల్ జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి విద్యార్థులకు సూచించారు. జాతీయ వీధి బాలల దినోత్సవం సందర్భంగా ఆచవరం ప్రాథమిక పాఠశాలలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో బాలల చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సు శుక్రవారం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ వీధి బాలలను గుర్తిస్తే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు తెలియజేయాలన్నారు. కోర్టులో ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద ఫిర్యాదు చేసినా వీధి బాలలకు కోర్టు ద్వారా శరణాలయాలకు సిఫార్సులు చేస్తామన్నారు. ప్యానెల్ లాయర్లు పి.పవన్ కాంత్, డి.శివప్రసాద్ బాలబాలికలకు చట్టాలు, నిర్బంధ విద్యా హక్కు చట్టం గురించి వివరించారు. హెచ్ఎం కె.జ్ఞానేశ్వరి పాల్గొన్నారు.



ఆచవరం పాఠశాల్లో మాట్లాడుతున్న జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి

## రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

గుడ్లవల్లేరు: పట్టభద్రుల ఎన్నికలను పురస్కరించుకుని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో తహసీల్దార్ బి.లోకరాజు శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల్లో పాటించాల్సిన నియామావళిని వివరించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అట్లూరి దిలీప్‌కుమార్, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు నాగు, టీడీపీ నాయకులు జంగం మోహనరావు, సూరపనేని పరంధామయ్య, బీఎస్పీ నాయకుడు పాపారావు, సీపీఎం మండల నాయకుడు పిడుగు దేవసహాయం పాల్గొన్నారు.

## అంకితభావంతో పని చేస్తే గుర్తింపు

కైకలూరు: అంకిత భావంతో పని చేసే ఉద్యోగులు అన్ని చోట్ల గుర్తింపు ఉంటుందని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు పేర్కొన్నారు. కై కలూరు వ్యవసాయ మార్కెట్ యార్డు కల్యాణ మండపంలో శీతనపల్లి పంచాయతీ గ్రేడ్–1 కార్యదర్శి గమిడి శివన్నారాయణ ఉద్యోగ విరమణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. అనంతరం శివన్నారాయణ, శాంత కుమారి దంపతులను సన్మానించారు. ఎంపీపీ అడవి కృష్ణ, జిల్లా పంచాయతీ అధికారి కె.అనురాధ, ఈఓపీఆర్డీ కొండలరావు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**■ 'సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకురండి'**

గుడివాడ టౌన్: పట్టణ ప్రజలకు ఏ విధమైన సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని బంటుమిల్లి రోడ్, పాత బైపాస్ రోడ్, పంచవటి కాలని తదితర ప్రాంతాల్లో పర్యటించారు. పంచవటి కాలనీలో డ్రెయినేజీ సమస్య ఉందని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సమస్యను పరిష్కరించాలని సచివాలయ కార్యదర్శికి సూచించారు.

**■ ఎస్ఏకే స్వామి సేవలు ప్రశంసనీయం**

పమిడిముక్కల: ఐనపూరు హైస్కూల్ హెచ్ఎంగా పనిచేస్తున్న నందివాడ ఆనంద కాకుళస్వామి శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా హైస్కూల్లో పాఠశాల విద్యాకుటుంబం ఆధ్వర్యంలో జరిగిన ఉద్యోగ విరమణ సభలో స్వామి దంపతులను సత్కరించారు. ఉద్యోగ నిర్వహణలో తనకు సహకరించిన ఉపాధ్యాయులు, గ్రామస్తులకు స్వామి కృతజ్ఞతలు తెలిపారు.

**■ 1,395 మందికి ఓటు హక్కు**

ముదినేపల్లి రూరల్: ఉమ్మడి కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నిక నగారా మోగింది. ఈ ఎన్నిక ఈ నెల 27న నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించి మండలంలో రెండు పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. మండలంలో 1,395 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకున్నారు.

**■ అంకితభావంతో విధులు నిర్వహించాలి**

ముదినేపల్లి రూరల్: ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వహిస్తేనే తగిన గుర్తింపు లభిస్తుందని ఎంపీడీఓ వై.రామకృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సబార్డినేట్‌గా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి కోడూరి వీరదుర్గా ప్రసాద్ శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ప్రసాద్ దంపతులను ఎంపీడీఓ ఆధ్వర్యంలో కార్యాలయ ఉద్యోగులు శుక్రవారం ఘనంగా సత్కరించారు.

**■ పక్కా ఇళ్లను నిర్మించుకోవాలి**

గుడ్లవల్లేరు: స్థానిక జగనన్న కాలనీలోని పక్కా ఇళ్లను నిర్మించుకోవాలని లబ్ధిదారులను ఎంపీడీఓ టి.విజయసారథి కోరారు. శుక్రవారం ఆయన జగనన్న కాలనీలో పర్యటించి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. మార్చి లోగా నిర్మాణంలో ఉన్న ఇళ్లను పూర్తి చేసుకోవాలన్నారు. హౌసింగ్ ఏఈ సురేంద్ర, గ్రామ కార్యదర్శి నరసింహారావు పాల్గొన్నారు.

**■ 7నుంచి సత్యదేవుని బ్రహ్మోత్సవాలు**

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలను ఈ నెల 7వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నారు. శుక్రవారం ఆ బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పనులను నిర్వాహకులు ప్రారంభించారు. ఉత్సవాల పందిరికి సంబంధించిన రాటను పాతారు. ఆలయ పండితుడు రొంపిచర్ల శ్రీనివాసాచార్యులు, నరేష్, రవి పాల్గొన్నారు.

**■ టెన్త్ విద్యార్థులకు దాతల అల్పాహారం**

గుడ్లవల్లేరు: పెంజెండ్రలోని టెన్త్ విద్యార్థులు రాబోయే వార్షిక పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. వీరికి అల్పాహారం లేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆ గ్రామంలోని దాతలు వారికి అల్పాహారానికి అయ్యే ఖర్చును ఇచ్చేందుకు ముందుకొచ్చారు. ఆ పేద విద్యార్థులకు దాతలు వైఎస్సార్ సీపీ బూత్ కమిటీల మండల కన్వీనర్ బలుసు జితేంద్ర, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు బొప్పన శివప్రసాద్, సర్పంచి రేమల్లి తాతబ్బాయ్ అల్పాహార ఖర్చును ఇస్తున్నట్లుగా ప్రకటించారు.

**■ ఘనంగా భరతమాత ఆలయ వార్షికోత్సవం**

నందివాడ: దేశంలో రెండో దేవస్థానంగా పేరుగాంచిన భరతమాత ఆలయ వార్షికోత్సవం మండలంలోని పోలుకొండ శివారు నాగభూషణపురంలో బొర్రా సత్యనారాయణ, పర్వతనేని బసవవెంకట సూర్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

**■ సబ్సిడీపై పురుగు మందుల పంపిణీ**

మండవల్లి: ఆహారం పోషకాహార భద్రత కింద మండలంలోని పెరికెగూడెంలో మినుము పంట వేసిన రైతులకు 50 శాతం రాయితీపై వనరులైన పురుగు మందులను మండవల్లి సహాయ సంచాలకులు జి వెంకటమణి శుక్రవారం అందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులతొ పురుగులు, తెగుళ్ల నివారణ చర్యలను వివరించారు. రైతులకు భూసార ఫలితాల కార్డులను అందజేశారు. ఏఓ ఎస్కే జరీనా, సాగునీటి సంఘం అధ్యక్షుడు ఎలికే రాంబాబు పాల్గొన్నారు.

**■ సీసీ కెమెరాల ఏర్పాటుకు వితరణ**

కై కలూరు: పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు శుక్రవారం ఆటో ఫైనాన్స్ దుకాణ యజమానులు రూ.1,60,000 వితరణగా అందించారు. పట్టణ సీఐ పి.కృష్ణ ఆధ్వర్యంలో ఇటీవల అవగాహన కల్పించారు. ప్రేమసాయి, లక్ష్మి, వరుణ్, షణ్ముఖ, పద్మ పూజిత, వెంకటసాయి, శ్రీనివాస ఆటో ఫైనాన్స్ యజమానులు నగదును ఎస్ఐలు డి.వెంకటకుమార్, ఆర్.శ్రీనివాస్‌కు అందజేశారు.

## క్లుప్తంగా

### అంకితభావంతో పనిచేయాలి

తోట్లవల్లూరు: క్రమశిక్షణ, అంకితభావంతో పని చేసే ఉద్యోగులు ఎల్లప్పుడూ గుర్తుండిపోతారని తోట్లవల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సాయిప్రసన్న అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో పీహెచ్ఎన్‌గా పనిచేస్తున్న కూనపరెడ్డి పద్మావతి ఉద్యోగ విరమణ వీడ్కోలు కార్యక్రమం శుక్రవారం జరిగింది. పద్మావతి, వెంకటేశ్వరరావు దంపతులను డాక్టర్ సాయిప్రసన్న, డాక్టర్ మాధవి, సహచర ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు.

### ఉచిత వైద్యశిబిరం

తోట్లవల్లూరు: దేవరపల్లిలో ఉచిత వైద్యశిబిరం శుక్రవారం జరిగింది. ఉయ్యూరు వాకర్స్ అసోసియేషన్, ఆస్టర్ రమేష్ హాస్పిటల్(విజయవాడ) వారి సంయుక్తంగా నిర్వహించిన శిబిరంలో డాక్టర్ పీబీ ప్రశాంత్‌బాబు, డాక్టర్ బండారు అనూష, డాక్టర్ చంద్రమోహన్‌లు 102 మందికి ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, భీమవరపు అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం

పామర్రు: స్థానిక వల్మీకేశ్వరీ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలను శుక్రవారం ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాల్లో తొలిరోజు లక్ష్మీ గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలను చేశారు. ఆలయ నిర్వాహకులు బొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి, సుశీల దంపతులు పీటలపై కూర్చుని వార్షికోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు.

### విఘ్నేశ్వరుని హుండీ ఆదాయం రూ. 4.17 లక్షలు

గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్డులోని శ్రీ విఘ్నేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు శుక్రవారం జరిగింది. దేవదాయశాఖ అధికారులు, భక్తుల సమక్షంలో జరిగిన ఈ హుండీ లెక్కింపులో రూ.4,17,814 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ వై.శ్రీనివాస్ తెలిపారు. ఇది మూడు నెలల 17 రోజులు భక్తులు సమర్పించుకున్న కానుకల మొత్తం అని పేర్కొన్నారు. దేవదాయశాఖ తనిఖీ అధికారి సుధాకర్ పాల్గొన్నారు.

### నిత్యావసర సరుకులు అందజేత

గుడివాడ టౌన్: స్థానిక మందపాడులోని పురపాలక సంఘ నిరాశ్రయ ఆశ్రమంలో జీవిస్తున్న వారికి బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఎం. రామకృష్ణ నిత్యావసర సరుకులు శుక్రవారం అందజేశారు. వృద్ధులకు రోజువారి అవసరాలు తీర్చేందుకు కావాల్సిన సామగ్రితో పాటు వీల్‌చైర్‌ను అందజేశారు. ఆదరణ సేవా ఫౌండేషన్ చైర్ పర్సన్ బి. గోపిక, రీటా, హంసలేఖ, ఎల్. రాంబాబు పాల్గొన్నారు.

### అగ్నిప్రమాద బాధితులను ఆదుకోవాలి

మండవల్లి: అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం తక్షణమే స్థలం కేటాయించి, ఇల్లు నిర్మించి ఆదుకోవాలని సీపీఎం కార్యదర్శి, కార్యవర్గ సభ్యులు డీఎస్ వీడీ ప్రసాద్, శ్రీనివాసు కోరారు. మండలంలోని భైరవపట్నంలో ఇటీవల అగ్ని ప్రమాదం సంభవించిన ప్రాంతాన్ని శుక్రవారం పరిశీలించి బాధితులతో మాట్లాడారు. మంటల్లో ఒకే కుటుంబానికి చెందిన బాలుడితో సహా, మహిళ, మరో నలుగురు గాయాలపాలయ్యారని వారికి వివరించారు. వారిలో ఐదుగురు చనిపోగా ఒక వ్యక్తి మాత్రమే మిగిలారన్నారు. అతడి పరిస్థితి కూడా విషమంగా ఉందని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకుడు లాజరస్ పాల్గొన్నారు.

### రేషన్‌ను సక్రమంగా అందజేయాలి

పామర్రు: రేషన్ అర్హులందరికీ అందేవిధంగా తగుచర్యలు తీసుకోవాలని ఉయ్యూరు ఆర్డీఓ హేలా షారోన్ పేర్కొన్నారు. స్థానిక పీడీఎస్ గూడౌన్‌ను శుక్రవారం పరిశీలించారు. అనంతరం షారోన్ మాట్లాడుతూ నిత్యావసర సరుకుల పంపిణీలో ఎటువంటి అవకతవకలు లేకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. తహసీల్దార్ జీ రవికాంత్, ఆర్ఐ ఏ రాము, పీడీఎస్ డీటీలు రంగారావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### బకాయిలు చెల్లించాలి

గుడివాడ టౌన్: ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో కార్మికులకు ఈ నెల 4వ తేదీ లోగా పీఎఫ్ బకాయిలు, జీతాలు చెల్లించకుంటే నిరవధిక సమ్మె చేస్తామని మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు హెచ్చరించారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో జిల్లా డీసీహెచ్ఎస్ డాక్టర్ జయరాజు, సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. ఇందిరాదేవితో ఏఐటీయూసీ నాయకులు శుక్రవారం చర్చలు జరిపారు. రెండు నెలలుగా కార్మికులకు జీతాలు అందడంలేదని, మూడు సంవత్సరాలుగా పీఎఫ్ బకాయిలు చెల్లించడం లేదని జయరాజు దృష్టికి తీసుకెళ్లారు. సమస్య పరిష్కారానికి కృషి చేయనిపక్షంలో 5వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఏఐటీయూసీ అధ్యక్షుడు ప్రకాష్‌బాబు, కార్యదర్శి సత్యనారాయణ, ఎన్జీఓస్ అసోసియేషన్ గుడివాడ యూనిట్ కార్యదర్శి జి.రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

### చెత్త సంపద కేంద్రాలపై దృష్టి

గుడ్లవల్లేరు: చెత్త సంపద కేంద్రాలపై గ్రామ కార్యదర్శులు దృష్టి సారించాలని ఎంపీడీఓ టి.విజయసారథి ఆదేశించారు. శుక్రవారం ఆయన పంచాయతీ పరిధిలోని చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామ కార్యదర్శి నరసింహారావు ఉన్నారు.

### ఘనంగా ఆలయ విగ్రహ ప్రతిష్ట

నిమ్మకూరు(పామర్రు): మండలంలోని నిమ్మకూరు గ్రామంలోని ఎన్టీఆర్ కాలనీలో ఏపీ ప్రభుత్వం, దేవదాయ శాఖ (శ్రీవాణి ట్రస్టు) తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో నిర్మించిన శ్రీ కోదండరామస్వామి నూతన ఆలయ విగ్రహ ప్రతిష్టా మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాన్ని శ్రీమాన్ సుదర్శనం యోగానంద లక్ష్మీ నరసింహాచార్యులు, శిష్య బృందం నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులు అందరికి స్థానికులు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర సౌజన్యంతో స్వామివారి అన్న ప్రసాదాన్ని అందజేశారు. గ్రామ సర్పంచ్ పడమట దుర్గా శ్రీనివాస్, తహసీల్దార్ జీ రవికాంత్ పాల్గొన్నారు.

### పార్టీ బలోపేతానికి కృషి



కైకలూరు: క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ వలంటీర్స్ విభాగ అధ్యక్షుడు రేగిశెట్టి రాము అన్నారు. కైకలూరు పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్)ను కలిసి తనకు పదవి రావడానికి కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సతీష్, సుధాకర్ మసిపోగు శేషు, చంటి, విజయ్, ప్రతాప్, మరియదాసు, రాజేష్, బద్రి, ఆదాము పాల్గొన్నారు.

### ఫిల్టర్ బెడ్ల పరిశీలన

మండవల్లి: స్థానిక అగ్రహారంలోని తాగునీటి పథకానికి చెందిన ఫిల్టర్‌బెడ్ల మరమ్మతుల అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరావు, ఏఈ నాగరాజు శుక్రవారం పరిశీలించారు. సర్పంచ్ దంపతులు మెండా ఝాన్సీ, సురేష్ పాల్గొన్నారు.